

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం,29 ఆగస్టు 2025

8 పేజీలు


## కౌన్సిల్‌లో అక్రమ నిర్మాణాలు, నకిలీ బర్త్ సర్టిఫికెట్లపై

# దుమారం





- అమలాపురం మున్సిపల్ సమావేశంలో వాడి వేడిగా చర్చ
- జడ్పీ హైస్కూల్ స్థలంలో అక్రమ నిర్మాణాలు తొలగించాలన్న ఎమ్మెల్సీ
- నకిలీ సర్టిఫికెట్ వ్యవహారంలో ఎంతటివారు ఉన్నా చర్యలు తప్పవు
- సైబర్ క్రైమ్ ద్వారా విచారణ జరపాలి
- పట్టణంలో రోడ్లు నిర్మాణానికి రూ.100 కోట్లు కావాలన్న ఎమ్మెల్యే ఆనందరావు





**అమలాపురం,మేజర్‌న్యూస్:**

అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో అక్రమ కట్టడాలు, నకిలీ బర్త్ సర్టిఫికెట్లు కలకలం రేకెత్తించాయి. అమలాపురం మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో మున్సిపల్ అధికారుల అవినీతి పనితీరుపై ప్రశ్నించిన వైసీపీ కౌన్సిలర్ మాటలను పరిగణలోనికి తీసుకొని లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేయాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సూచించారు. ఫిర్యాదును స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ సర్టిఫికెట్లను నకలను క్రోడీకరించి అమలాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమలాపురం పురపాలక సంఘం సాధారణ సమావేశంలో కౌన్సిలర్లు లేవనెత్తిన పలు అంశాలు రసాభాసగా మారాయి.. మున్సిపల్ కార్పోరేషన్‌లో పూర్తిగా అవకతవకలతో నిండిపోయిందని పలువురు కౌన్సిలర్లు ఆరోపించారు. అమలాపురం పట్టణంలో అక్రమ నిర్మాణాల నుంచి పన్ను వసూళ్ల పర్వం వరకు, బర్త్ సర్టిఫికెట్ల జారీ నుంచి రోడ్డు ఆక్రమణల వరకు అంతా అవినీతి రాజ్యమేలుతోందనిపలువురు కౌన్సిలర్లు మండిపడ్డారు. అమలాపురం మున్సిపల్ కార్పోరేషన్ సాధారణ సమావేశం గురువారం ఛైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన జరిగింది. ఈకార్యక్రమానికి అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు,ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు,బమ్మిఇజ్రాయేల్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా మున్సిపల్ పరిధిలోని జడ్పీ హైస్కూల్ ముందు ఉన్న షాపులకు పన్ను వసూళ్లు చేస్తున్నారా లేదా అన్న ప్రశ్నను జనసేన కౌన్సిలర్ ఏడిద శ్రీను లేవనెత్తారు. దీనిపై కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ సమాధానం చెబుతూ ఈషాపుల విషయంఅటుమున్సిపాల్ కార్పోరేషన్, ఇటు జడ్పీకు సంబందించినదా అన్న మీమాంసలో వసూళ్లు జరగడం లేదని సమాధానం చెప్పారు. దీనిపైఎమ్మెల్సీకుడిపూడి సూర్య నారాయణరావు మాట్లాడుతూ హైస్కూల్ ఎదురుగా ఉన్న షాపులు అన్నీ అక్రమ నిర్మాణాలేనని, దీనిపై ఇప్పటికే తొలగించాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసిందని, అయినప్పటికీ ఎందుకు తొలగించడం లేదంటూ మండిపడ్డారు. దీనిపై ఎమ్మెల్యే ఆనందరావు జోక్యం చేసుకుని పూర్తి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. అదేవిధంగా ఇటీవలే మున్సిపల్ కార్పోరేషన్‌లో దొంగ సర్టిఫికెట్ జారీచేసిన విషయాన్ని మరో వార్డు కౌన్సిలర్ సంసాని బులినాని లేవనెత్తారు. ఇప్పటికే కమిషనర్‌కు ఫిర్యాదు చేశానని అయినా ఎటువంటి చర్యలు ఎందుకుతీసుకోలేదని ప్రశ్నించారు. ఫేక్ బర్త్ సర్టిఫికెట్లు జారీ ఆరోపణలపై దర్యాప్తు కోరుతూ అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు కమిషనర్ తెలిపారు. సెన్సిటివ్ పోస్టింగులో ఉన్న అధికారులను తక్షణం రీటేషన్ ప్రకారం మారుస్తానని మున్సిపల్‌కమిషనర్ నిర్మల్‌కుమార్ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ పట్టణంలో రోడ్లు అభివృద్ధి కోసం రూ.100 కోట్లు నిధులు అవసరమని అన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు దృష్ట్యా40అడుగుల రోడ్డుగా వెడల్పు చేయాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. అవసరం ఉన్నచోట ల్యాండ్ అక్విజెషన్ చేపట్టడం, టీడీఆర్ బాండ్స్ జారీచేయడం జరుగుతుందని ఎమ్మెల్యే ఆనందరావు స్పష్టం చేశారు. అదేవిధంగా చెత్తసమస్య తొలగించేందుకు డంపింగ్ యార్డుకు 15 ఎకరాల విస్తీర్ణం కావాల్సి ఉందని, దానిపై ఇప్పటికే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఓఎన్జీసీ చర్యలతో
# మత్స్యకారులు నష్టపోతున్నారు

- నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని వినతి
- అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు



**అమలాపురం,మేజర్‌న్యూస్ :** ఈ నెల 22వ తేదీ ఓఎన్జీసీ పైప్‌లైన్ లీకేజ్ మూలంగా ప్రక్కనే ఉన్న మడ అడవులుకాలిపోవడం,గాడిమొగ్గ భైరవపాలెంలో సముద్రపు నీరుఆయిల్‌లాగా మారడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌ని కలిసిన ఆయన అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, కాకినాడ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావులతో కలిసి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ ఈపైప్ లైన్ లీకేజీపై వెంటనే స్పందించి ఓఎన్జిసి అధికారులతో సంప్రదించి గంటలోనే లీకేజీని అరికట్టడం జరిగిందని అయినప్పటికీ సముద్ర తీర ప్రాంతం ఆయిల్ నీటితో భయానకంగా మారి మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. గత నవంబర్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, పార్లమెంట్ సభ్యులు పురందేశ్వరి,

- తరువాయి 2లో..

## పుష్కర్ ఘాట్‌లో
# ఏ ఆలయానికి ఇబ్బంది రాదు

- ఆలయాలకు మరింత శోభాయమానం రానుంది
- రెండు వంతెనల వ్యూ పాయింట్‌కి విఘాతం కలగదు
- అఖండ గోదావరి ప్రాజెక్ట్ డిజైన్‌తో ఎలాంటి నష్టం లేదు
- పుష్కర్ ఘాట్‌లో పనులు పరిశీలించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అఖండ గోదావరి ప్రాజెక్ట్ వలన పుష్కర్ ఘాట్‌లో ఏ ఆలయానికి ఇబ్బంది రాదని రాజమహేంద్రవరం సిటీఎమ్మెల్యేఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు)స్పష్టంచేసారు. అందుచేత ఎలాంటి ఆపోహలు పెట్టుకోవద్దని ఆయన అన్నారు. అఖండగోదావరి అభివృద్ధి పనులను టూరిజం డిపార్ట్మెంట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో అలాగే కాంట్రాక్టర్‌తో కలిసి గురువారం ఉదయం స్థానికపుష్కర ఘాట్‌లో ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వాసు మీడియాతో మాట్లాడుతూ రివర్ ఫ్రంట్ పనుల వలన గట్టుమీద ఉన్నవిగ్రహాలను ఏవిధంగా యూనిఫార్మ్‌గా పెట్టాలని నిర్ణయించామో అలాగే పుష్కర్ ఘాట్‌లోకూడా ఏఆలయానికి, ఏవృత్తి దారునికి ఇబ్బందిలేకుండా మరింతశోభాయ మానంగా తీర్చిదిద్దుతారని అన్నారు. అలాగే మొదటి,మూడవ రైలు వంతెనల మధ్య

- తరువాయి 2లో..

# ఘనంగా బిషప్ జయరావు పొలిమేర జన్మదిన వేడుకలు





పెదవేగి ,మేజర్ న్యూస్ : పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామంలో గల సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో కళాశాల చైర్మన్ ,ఏలూరు పీఠాధిపతులు మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేర జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో కళాశాల సిబ్బంది విద్యార్థులు బిషప్ 60వ పుట్టినరోజు నిర్వహించారు. బిషప్ పొలిమేర జయరావు కేక్ కట్ చేసి అందరికీ అభినందనలు తెలియజేశారు.తొలత కళాశాల విద్యార్థులు ఊరేగింపుతో నర్సింగ్ కళాశాలకు వెళ్లి అక్కడ నుంచి కళాశాల ఆడిటోరియంలో బిషప్ పుట్టినరోజు కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమం కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ సెక్రెటరీ మోజెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆర్చ్ బిషప్ ఆఫ్ ఎమిరేట్స్ బాంబే ముఖ్యఅతిథిగా పాల్గొన్నరు. బెంగుళూరుకు చెందిన సుప్రీం కోర్ట్ సీనియర్ అడ్వకేట్ సర్. జవాక్కిమ్ ఎఫ్ రెషి అతిథులుగా పాల్గొన్నారు .ఈ కార్యక్రమంలో ఏలూరు పీఠం వికార్ జనరల్ ఫాదర్ పి.బాల,చాన్సిలర్ ఫాదర్ ఇమ్మానియేల్ పీఠం కోశాధికారి ఫాదర్ బి రాజు వివిధ ప్రాంతాన్ని వచ్చిన గురువులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ స్లేవరాజు దంత కళాశాల అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఫెలిక్స్ ,నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ పి జాకోబ్ అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

## విద్యుత్ అమరవీరుల బషీర్ బాగ్ పోరాటానికి 25 ఏళ్లు



పెనుమంట్ర, మేజర్ న్యూస్ : విద్యుత్ అమరవీరుల బషీర్బాగ్ పోరాటం నేటి 25 సంవత్సరాలు. 2000 సంవత్సరంలో ప్రపంచ బ్యాంకు షరతులు అమలు చేసి చంద్ర బాబు నాయుడు . విద్యుత్తు భారాలు వ్యతిరేకిస్తూ వేలాదిమంది హైదరాబాదు బషీర్బాగ్ లో ముగ్గురుని తుపాకు గుళ్లకు బలి తీసుకున్న. చంద్రబాబు 2025 లో తిరిగి విద్యుత్తు స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను ప్రైవేటు కంపెనీ వాళ్ళు దోచుకునే విధంగా ప్రధాని కంపెనీకి దోశ పెట్టే విధంగా చంద్రబాబు విధాలు ఉన్నాయని సిపిఎం నాయకులు ఆకుల హరే రామ్ అన్నారు బ్రాహ్మణ చెరువు సెంటర్లో విద్యుత్తు అమరవీరులకు నివ్వాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా హరే రామ్ మాట్లాడుతూ మరొక విద్యుత్తు పోరాటానికి ప్రజల సిద్ధం కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు కె పద్మజ నరసింహమూర్తి తాడిపర్తి నరేంద్ర బి విజయకుమార్ ఆంజనేయులు. తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తాం



యలమంచిలి, మేజర్ న్యూస్: బషీర్ బాగ్ లో విద్యుత్తు ఉద్యమం జరిగి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆ ఉద్యమంలో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి,బాలస్వామిలకు గురువారం మండలంలోని చించినాడ అరుంధతి పేట నందు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు.ముందుగా అమర వీరుల చిత్రపటానికి డి వైఎఫ్ఐ జిల్లా నాయకులు తెన్నేటి స్టాలిన్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు జిల్లా నాయకులు బాతిరెడ్డి జార్జి, సీనియర్ నాయకులు దేవ సుధాకర్, బొల్లా నరసింహమూర్తి, బాతిరెడ్డి సుగుణ, ఆకుమర్తి పద్మరాజు, జున్ను, సంజయ్,తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరు జిల్లా పేరు మార్చాలి

**– ఏపీ రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యులు**
**జిఆర్కె రంగారావు**



**ఆగిరిపల్లి,మేజర్ న్యూస్:** ఏలూరు జిల్లా పేరును హేలాపురి లేక ద్వారకా తిరుమల జిల్లాగా మార్చాలని ఏపీ రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ నెంబర్ జి ఆర్ కె రంగారావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎన్నో విశిష్ట అర్థాలు కలిగిన హేల అనే పదాన్ని పూర్వ ప్రయోగంగా కలిగిన హేలాపురి ప్రాంతం –శతాబ్దాల క్రితం ఎంతో వారసత్వ–చారిత్రిక సాంస్కృతిక వైభవం–ప్రాముఖ్యత కలిగి ఉండేదని, వేంగి రాజ్యంలో భాగంగాను–బౌద్ధ రాజ్యంలో రాజధానిగాను వెలుగొందింది. కృష్ణ–గోదావరి నదుల మధ్య–గోదావరి నుంచి వచ్చే ఏలూరు కాలువ, కృష్ణా నది నుంచి వచ్చే ఏలూరు కాలవ ,తమ్మిలేరు కలిసి కొల్లేరు సరస్సు గా మారే భౌగోళిక సుందరహేలే హేలాపురి అని అన్నారు.ఆంగ్లేయుల పాలనకాలంలో వారికి నోరు తిరగక హేలాపురిని ఏలూరుగా పిల్చుకోవటం, ఆ తర్వాత కూడా దానిని అందిపుచ్చుకొని వలసవాద బానిసత్వంగా నేటికి కూడా మనందరం ఏలూరు అని పిలుచుకోవడం దురదృష్టకరంఅని,ఏ విధమైన స్పందన కలిగించని ఏలూరు అనే పేరును మార్చి ఎంతో మంచి పేరైన హేలాపురి అని పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

కనీసం ఏలూరు ప్రాంతంలో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ద్వారకాతి రుమల జిల్లాగా పేరు పెట్టిన కొంతవరకు పర్వాలేదని,ఇది నా వ్యక్తిగత అభిప్రాయమని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుతానికి ఏలూరు జిల్లా పరిధిలోని, నూజివీడు ప్రాంతంలో నివసించుచు న్నందున–రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి,జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి,దీని కోసమే ఏర్పడిన కమిటీ దృష్టికి ,ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తానని తెలిపారు.

## గణపతి నవరాత్రులలో డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా

– ఎస్సై మౌనిక



పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణం, మండల పరిధిలో వినాయక చవితిని పురస్కరించుకుని గణపతి నవరాత్రులలో భాగంగా జిల్లా ఎస్పి జి.బిందుమాధవ్, డిఎస్పి డి.శ్రీహరిరాజుల ఆదేశాల మేరకు సిఐ విజయశంకర్ పర్యవేక్షణలో ఎస్సై వి.మౌనిక ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా ఉంచినట్లు ఎస్సై వి.మౌనిక తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ పెద్దాపురం పట్టణంలో వివిధ ప్రాంతాలలో డ్రోన్ కెమెరా ద్వారా పర్యవేక్షించడం జరిగిందని, అలాగే వినాయక నవరాత్రులు పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల ఆధ్వర్యంలో పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు ఎస్సై మౌనిక తెలిపారు. దీనిలో భాగంగా గురువారం ఆమె డ్రోన్ కెమెరా ద్వారా వినాయక మండపాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## ఓఎన్జీసీ చర్యలతో మత్స్యకారులు నష్టపోతున్నారు

మొదటిపేజీ తరువాయి

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కలిసి ఈ విషయం విన్నవించడం జరిగిందని తెలిపారు.జరిగిన విషయాన్ని సాక్ష్యాలతో సహా మూడు పేజీల సమాచారంతో అందించడం జరిగిందని,ఆయిల్ కంపెనీలు ప్రతినిధులతో జిల్లాకలెక్టర్లు ఇరువురు సంప్రదించి నష్టపరిహారాలు ఇప్పించాలని వారు కోరారు. నవంబర్ డిసెంబర్‌లలో ఓఎన్జిసి రిలయన్స్ రెండవ పైప్‌లైన్ వచ్చే అవకాశం ఉందని, అప్పుడు కూడా అందరికీ పరిహారాలు అందించాలని వారు కోరారు. ఈనెల 22న జరిగిన పైప్‌లైన్ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు అందించి పూర్తి స్థాయిలో విచారణచేపట్టాలని కోరారు. అంతేకాకుండా చమురు సంస్థల కార్యకలాపాల వల్ల స్థానిక మత్స్యకారులకు, ప్రజలకు రక్షణతో పాటు, పరిహారం అందించాలన్నారు.

## పుష్కర్ ఘాట్‌లో ఏ ఆలయానికి ఇబ్బంది రాదు

మొదటిపేజీ తరువాయి

గల వ్యూపాయింట్‌కి కూడాఈ ప్రాజెక్ట్ వలన ఎలాంటి విఘాతం కలగదని ఎమ్మెల్యే వాసు స్పష్టంచేసారు. దీనిపై సోషల్ మీడియాలో వస్తున్న అపోహల గురించి ఆందోళన చెందనవసరం లేదని ఆయన అన్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండానే ప్రాజెక్ట్ డిజైన్ చేసారని ఆయన చెప్పారు. **–శానిటేషన్ సిబ్బందికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అభినందన..**కాగా వినాయక చవితిని పురస్కరించుకుని పుష్కర్ ఘాట్ దగ్గర వినాయక చవితి విగ్రహాలను, పత్రిని నిమజ్జనం చేయడానికి వస్తున్న భక్తుల నుంచి వాటిని సేకరించి గోదావరి కలుషితం కాకుండా విడివిడిగా వేరు చేస్తున్న శానిటేషన్ సిబ్బందిని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అభినందించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, టూరిజం, నగర పాలక సంస్థ అధికారులు తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

## ఘనంగా శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో వినాయక చవితి వేడుకలు

**పెనుమంట్ర, మేజర్ న్యూస్ :** పెనుమంట్ర గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో వినా యక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి పూజా కార్యక్రమాలు నిర్వహించిన రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం.రాష్ట్ర అధ్యక్షులు.భూపతిరాజు రవీంద్ర రాజు రాధా దేవి దంపతులు కుమారుడు వెంకట నాగ సంజయ్ వర్మ. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని గణపతి విగ్రహాన్ని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించడం జరిగింది. విగ్రహ దాత సత్య టెక్నాలజీస్ అధినేత కర్రి సుబ్బారెడ్డి . లడ్డు దాత గంటా సాయి వరప్రసాద్ తాతయ్య రాఘవులు 20 కేజీ లడ్డు ఇవ్వడం జరిగింది. స్వామివారి లడ్డును 9వరోజు గురువారం 4వ తేదీన స్వామి వారి ఊరేగింపు సందర్భంగా ఆరోజు మధ్యాహ్నం ఒంటిగంటకు స్వామివారి లడ్డు పాట పెట్టడం జరుగుతుంది. కావున భక్తులు లడ్డు పాటలో పాల్గొని స్వామివారి లడ్డు ప్రసాదను స్వీకరించాలని కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమాలు కమిటీ సభ్యులు రవీంద్ర రాజు, గోపిరెడ్డి, విజయ్, వీర వెంకటరెడ్డి, సత్యనారాయణ, రాము, ఐటిఐ రాంబాబు, రంగరాజు, నాగిరెడ్డి, చంటి పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, కొత్త స్టేషన్ల ఏర్పాటు ప్రక్రియలకు సహకరించండి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రక్రియలకు సహాయ, సహకారాలను అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలను కోరారు. గురువారం కలెక్టరేట్ లో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరావు ..గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఎన్నికల కమీషన్ సూచనల మేరకు జిల్లాలో చేపడుతున్న ఓటర్ జాబితా కార్యక్రమాలు, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, కొత్త పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదన, ఫారం-6, 7, 8 పరిష్కారం, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమాలు జిల్లాలో సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారాన్ని అందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1000 నుండి 1200 మంది ఉన్న పోలింగ్ స్టేషన్లు 443, 1200 మంది పైబడి ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లను 423 ఉన్నాయన్నారు. వీటిలో సుమారు 400 స్టేషన్లను ఓటర్ల సౌలభ్యాన్ని పరిగణలోకి తీసుకుని పునర్వవస్థీకరణ, కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అలాగే పోలింగ్ నిర్వహణకు అనువుగాలేని కేంద్రాలను అనువైన మరో భవనాలకు మార్పుకు ప్రతిపాదిస్తామన్నారు. హేతుబద్దీకరణ ప్రకారం జిల్లాలో కొత్తగా 183 పోలింగ్ కేంద్రాలు రానున్నాయని, ప్రస్తుతం జిల్లాలోని 1640 పోలింగ్ కేంద్రాల్లో 16,40,278 మంది ఓటర్లుగా నమోదైయున్నారని ఆయన తెలిపారు. జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి ఎన్నికల కమిషన్ నిర్దేశించిన బిఎల్ఏ-2 ఫారమ్ లో వివరాలను తెలియజేయాలని డీఆర్వో కోరారు. సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు గదుల సాయిబాబా (టిడిపి), రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్ఆర్ సిపి), ఎ.వి.వి.సత్యన్నారాయణ (జనసేన), సిహెచ్.రమేష్ బాబు (బిజెపి), సబ్బారపు.అప్పారావు (బిఎస్పి), పి.శ్రీనివాసు (ఐ.ఎన్.సీ), తోకల వరదరాజు నంబి (ఆప్), పలివెల వీరబాబు (సీపీఎం), ఎన్నికల విభాగ పర్యవేక్షకులు ఎం.జగన్నాథం పాల్గొన్నారు.

# గిరిజన మహిళ మరణంపై పునర్విచారణ

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు రంపచోడవరం మండలం ఐ.పోలవరం గ్రామానికి చెందిన గిరిజన మహిళ కంగల చెల్లాయమ్మ మృతిపై అల్లూరి జిల్లా డిసిహెచ్ఎస్ పునర్విచారణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎంపీపీ బంధం శ్రీదేవి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపీపీ బంధం శ్రీదేవి మాట్లాడుతూ రంపచోడవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వీడాలన్నారు. ఏజెన్సీ గ్రామాల నుండి ఆసుపత్రి వచ్చే రోగులతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచనలు చేసారు. ముఖ్యంగా అత్యవసర రోగులను రిఫరల్ అవసరం అయితే ఆలస్యం చెయ్యకుండా రిఫర్ చెయ్యాలని, ప్రాణాల మీదకు వచ్చేవరకు ఉంచవద్దని కోరారు. అలా అని రోగులను రిఫర్ చేయడమే పనిగా పెట్టుకోవద్దని, ఆసుపత్రి ఆవరణలో అంబులెన్సు అందుబాటులో లేనందున అత్యవసర పరిస్థితిలో ఐటీడీఏ కు కాల్ చేసి రప్పించేలోపు రోగి ప్రాణాల మీదకు వస్తుందని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతంలో మాతాశిశు మరణాలు లేకుండా చూడాలని, వైద్యసేవలు కోసం డాక్టర్లు దగ్గరకు వచ్చే రోగులు మిమ్మల్ని దేవుళ్ళుగా చూసే పరిస్థితి తెచ్చుకోవాలని, మీకోసం పదిమందికి గొప్పగా చెప్పుకునే రోజులు



రావాలని కోరుకుంటున్నానన్నారు. విధినిర్వహణలో వైద్యులకు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా అండగా ఉంటామని విచారణ కమిటీతో ఎంపీపీ శ్రీదేవి అన్నారు. ఆమెతో పాటు ఎంపీటీసీ వంశీ కుంజం ఉన్నారు. విచారణలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీలో ఎరువుల కొరతతో గిరిజన రైతుల ఇబ్బందులు

– ప్రైవేట్ వ్యాపారుల లైసెన్సులు రద్దు చేయాలని ఎంపీపీ డిమాండ్



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఎరువుల కొరతతో ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన రైతులు ఆర్థికంగా, వ్యవసాయ పరంగా ఇబ్బందులు పడుతుంటే, సంబంధిత అధికారులు పట్టించుకోకుండా ఉండడం విచారకరమని రంపచోడవరం ఎంపీపీ బంధం శ్రీదేవి పేర్కొన్నారు. రంపచోడవరం మండలములో ఎరువుల కొరతపై మండల వ్యవసాయ శాఖాధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) అధికారులతో ఎంపీపీ శ్రీమతి శ్రీదేవి వారి కార్యాలయంలో సమావేశమైయ్యారు. ఈసందర్భంగా సంబంధిత అధికారులు మాట్లాడుతూ పిఎసిఎస్ ఎరువుల లైసెన్సు కాలపరిమితి ముగిసినందున,దానిద్వారా ఇప్పటికిప్పుడు ఎరువులు సరఫరా చేయడం సాధ్యమయ్యే పనికాదన్నారు. అలాగే మండలంలో ప్రయివేటు దుకాణదారులు సైతం ఎరువులు బుక్ చేయలేదని, వారు ఎరువులు అమ్మకానికి సుముఖత చూపట్లేదన్నారు. దీనిపై ఎంపీపీ బంధం శ్రీదేవి మాట్లాడుతూ అలాంటి పక్షంలో ప్రయివేటు దుకాణదారుల లైసెన్సులను ఎందుకు రద్దుచేయకూడదని ప్రశ్నించారు. ఎరువుల వ్యాపారులకు నోటీసులిచ్చి, వారి లైసెన్సులను రద్దు చేయమని ఎంపీపీ ఆదేశించారు. ఎరువులు రంపచోడవరంలో లభ్యం కాని పరిస్థితుల్లో పక్కనే ఉన్న గోకవరం, కొత్తపల్లి, జగ్గంపేట గ్రామాలకు రైతులు వెళ్తే మీ మండలం వారికి ఇక్కడ ఎరువులు ఇవ్వమని అక్కడి దుకాణదారులు చెప్తున్నారన్నారు. ఎరువులు లభ్యం కాకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికిప్పుడు ఎరువులు లభ్యమయ్యే అవకాశం లేని పరిస్థితుల్లో జిల్లా వ్యవసాయ శాఖాధికారితో సెల్ ఫోనులో ఎంపీపీ శ్రీదేవి మాట్లాడారు. నాలుగు రోజుల్లో ఎరువులు రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేపిస్తామని ఎంపీపీకు జిల్లా వ్యవసాయశాఖ అధికారి హామీ ఇచ్చారు. మండల వ్యవసాయ శాఖాధికారులు ఈ విషయాన్ని సచివాలయం అగ్రికల్చర్ అసిస్టెంట్లు ద్వారా ఆయా గ్రామాల్లోని రైతులకు తెలియపరచి అధిక ధరలకు బ్లాక్ మార్కెట్లో ఎరువులు కొని మోసపోకుండా చూడాలని ఎంపీపీ శ్రీదేవి సూచించారు.

## వరదలలో రోడ్డు మార్గం లేక..... వైద్యం అందక వ్యక్తి మృతి



**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మండలంలోని మల్లెతోట గ్రామానికి చెందిన మడకం శ్రీరాములు అనే వ్యక్తి ఆరోగ్యం బాగోలేకపోవడం వలన గ్రామం నుండి చింతూరు ఆసుపత్రికి అడవి మార్గం గుండా తీసుకొని వెళ్ళేక్రమంలో చనిపోయాడు. మృతునికి భార్య మరియు ఇద్దరు పిల్లలు ఉన్నారు.ముకునూరు నుండి సోకిలేరు వరకు వరకు వరద నీరు రహదారిపైన ఉండటం వలన మల్లెతోట నుండి నేరుగా చింతూరు ఆసుపత్రికి వెళ్ళడానికి అవకాశం లేనందున అడవి మార్గం గుండా ఏజీ కోడేరు, అక్కడ నుండి కుందులూరు మీదగా నర్సింగపేట చేరుకొని అక్కడ సోకిలేరు వాగు దగ్గర నాటు పడవ దాటి వేగితోట మీదగా చింతూరు చేరుకోవడం చాలా కష్టం మరియు ప్రయాసతో కూడుకొని ఉండటం వలన వరద సమయాలలో చాలా ఇబ్బందులు పడవలసి వస్తుంది. గత మూడు రోజులు నుండి కురిసిన భారీ వర్షాల కారణంగా చీకటివాగు మరియు సోకిలేరు కాజ్ వేపై వరద నీరు చేరడం వలన మల్లెతోట గ్రామానికి చెందిన మడకం శ్రీరాములు అనే వ్యక్తిని అడవి మార్గం గుండా ముకునూరు వరకు తీసుకొనివచ్చి అక్కడ నుండి పడవ దాటించి చింతూరు ఆసుపత్రికి చేరుకునే లోపలే ప్రాణాలు విడవడం జరిగింది. వరద సమయంలో ఇలాంటివి ఇంకా ఎన్ని జరుగుతాయో అని భయం భయంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరతగతిన పునరావాసం మరియు ప్యాకేజి ఇచ్చినట్టు ఐతే వెళ్ళిపోతామని వేడుకొంటున్నారు.

## విద్యుత్ షాక్ తో ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలోని పాశిల వీధిలో ట్రాన్స్ ఫార్మర్ పై విద్యుత్ లైన్ మరమ్మత్తులు చేస్తుండగా, విద్యుత్ షాక్ తో జూనియర్ లైన్ మెన్ ఆరుమిల్లి రామకృష్ణ (32స.లు) మృతి చెందినట్లు ఎస్సై వి.మౌనిక తెలిపారు. దీనిలో భాగంగా పెద్దాపురం పట్టణం, శివాలయం వీధికి చెందిన యాళ్ళ చిన్నిబాబు తీవ్రగాయాలు అయినట్లు ఎస్సై తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే విద్యుత్ సిబ్బంది స్థానిక ప్రభుత్వాసుపత్రికి ఇరువురును తీసుకువెళ్ళగా, అప్పటికే ఆరుమిల్లి రామకృష్ణ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు, గాయాలైన యాళ్ళ చిన్నిబాబును కాకినాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## విద్యుత్ అమర వీరులకు నివాళి - ప్రతిజ్ఞ



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెంచిన విద్యుత్ ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా బషీర్ బాగ్ విద్యుత్ అమర వీరులు రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలాస్వామిల స్ఫూర్తితో పోరాడాలని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు నీలపాల సూరిబాబు పిలుపునిచ్చారు. ఆగష్టు 28 విద్యుత్ అమర వీరుల సంస్మరణ – ప్రతిజ్ఞ దినం సందర్భంగా మున్సిపల్ సెంటర్ లో గురువారం అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యుత్ అమర వీరులకు నివాళులు అర్పించే కార్యక్రమం సిపిఎం మండల కార్యదర్శి క్రాంతికుమార్ అధ్యక్షతన జరిగింది. దీనిలో భాగంగా 2000 సంవత్సరం ఆగష్టు 28న విద్యుత్ పోరాటంలో అమరవీరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలాస్వామిల చిత్రపటాలకు ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు చింతల సత్యనారాయణ, సూరిబాబులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిరపురపు శ్రీనివాస్, కేదారి నాగు, డి.సత్యనారాయణ, డి.కృష్ణ, సిరపురపు మరిదయ్య, అప్పన్న, రమేష్, రాంబాబు, గునూరు రమణ, తైనాల శ్రీను, తాడిశెట్టి గంగ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలపై విద్యుత్ చార్జీల భారాలు రద్దు చేయాలి

- ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలి
- విద్యుత్ అమర వీరుల స్ఫూర్తితో ఉద్యమిస్తాం
- కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వామపక్షాల ప్రతిజ్ఞ



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న విద్యుత్ చార్జీల ధారాలకు వ్యతిరేకంగా విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో పోరాడుతామని వామపక్ష పార్టీల నాయకులు గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో ముందుగా 2000 ఆగస్టు 28న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్ బషీర్ బాగ్‌లో జరిగిన విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామిల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జె. వెంకటేశ్వర్లు, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు గొడుగు సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, సిపిఎం కాకినాడ నగర కన్వీనర్ పలివెల వీరబాబులు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రపంచ బ్యాంకు ప్రయోగశాలగా మార్చి ప్రజల పైన భారీగా విద్యుత్ ఛార్జీల భారం వేసినప్పుడు వామపక్షాలు రాష్ట్రవ్యాప్తంగా చారిత్రాత్మకమైన పోరాటం నిర్వహించడం జరిగిందన్నారు. ఆ ఉద్యమ పతాక స్థాయిలో 2000 ఆగస్టు 28న హైదరాబాదులో జరిగిన కాల్పుల్లో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి ల స్ఫూర్తితో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారీగా వేస్తున్న విద్యుత్ చార్జీల భారాలకు వ్యతిరేకంగా పోరాడుతామని ప్రతిజ్ఞ చేస్తున్నామన్నారు. అదానీ కంపెనీ తో జగన్ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాన్ని ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, సెకి ఒప్పందం, టైం ఆఫ్ ది డే విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ లను బిగించడం ఆపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలు రద్దు చేయకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. ప్రజలంతా వామపక్షాల ఉద్యమానికి అండగా నిలబడాలని కోరుతున్నామన్నారు.సిపిఐ (ఎంఎల్) జిల్లా నాయకులు సిహెచ్. నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ లు మాట్లాడుతూ అదానీ కి 20 సంవత్సరాలపాటు లక్ష కోట్ల రూపాయల ఒప్పందం మోడీ వత్తిడితో గత ప్రభుత్వం చేసుకుందన్నారు. ప్రజలకు అత్యవసరమైన విద్యుత్ అవసరాన్ని అవకాశంగా తీసుకుని భారాలు వేయడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మోడి అదానీ వైపు ఉంటారా, రాష్ట్ర ప్రజల వైపు ఉంటారా తేల్చుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి పప్పు ఆదినారాయణ, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎ.భవాని,సాయి,సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు ఆర్ రఘువులు, గుబ్బల ఆదినారాయణమూర్తి, ఐఎఫ్టియు నాయకులు కె.చంటి, వై.లోకాంబిక, శ్రీకాంత్, దుర్గా మహేష్, ఎన్.స్వామి, ఎన్.వరలక్ష్మి, ఎం.త్రినాథ్, పి ఏసు, త్రిమూర్తులు, సత్యనారాయణ, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు గుబ్బల నాగేశ్వరరావు, మహిళా నాయకురాలు జి.నాగమణి, రైతు కూలీ సంఘం నాయకులు వై..సత్తిబాబు, ఎ.ఐ.ఎఫ్.టి.యు. జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యం, పిఒడబ్ల్యు స్త్రీ విముక్తి నాయకురాలు రెడ్డి దుర్గాదేవి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కెఎస్ శ్రీనివాస్ నగర కమిటీ సభ్యులు మలక వెంకట రమణలతో పాటు కె.వీరబాబు, చంద్రమళ్ళ పద్మ, మేడిశెట్టి వెంకటరమణ, కె.సత్తిబాబు, అనపర్తి ఏడుకొండలు, పాలిక రాజేంద్ర ప్రసాద్, సురేష్, రమేష్, భూలక్ష్మి, రాణి, యు.సత్యనారాయణ, మంజన్ తదితరులు పాల్గొన్నారు.

# అవంతి నగర్ గణపతిని దర్శించుకున్న బెజవాడ

- పట్టు కండువా వేసి స్వాగతం పలికిన ఉత్సవ కమిటీ

కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ : గణపతి నవరాత్రుల్లో భాగంగా కాకినాడ రూరల్ తిమ్మాపురం గ్రామం అవంతి నగర్‌లో ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం ఏర్పాటుచేసిన గణపతి నవరాత్రులు అంగరంగ వైభవంగా జరిగాయి. మొదటి రోజు మహిళలు స్వామివారి భక్తి పాటలతో గానామృతం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిమ్మాపురం గ్రామ సర్పంచ్ జేఎన్టీయూకే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ బెజవాడ వీరవెంకట సత్య నారాయణ మండపానికి వచ్చి గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ పట్టు కండువా వేసి సత్కరించారు. ఈ



సందర్భంగా సర్పంచ్ బెజవాడ మాట్లాడుతూ కాలనీలో ప్రజలందరూ గణనాథుని ఆశీస్సులతో సుభిక్షంగా సంతోషంగా ఉండాలని అన్నారు.

# ఎయిడ్స్ నివారణకు సమన్వయ సమావేశం

**కాకినాడ, మేజర్ న్యూస్ :** యానాం జిల్లా హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులకు మెరుగైన సేవలు అందించేందుకు పుదుచ్చేరి రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మరియు కాకినాడ జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ సమన్వయ సమావేశము డా.ఏ.అరుల్విసగన్, ప్రాజెక్టు డైరెక్టర్, పుదుచ్చేరి రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారు స్థానిక రోటరీ సమావేశ మందిరములో జిల్లా ఎయిడ్స్ నివారారణ మరియు నియంత్రణ సంస్థ మరియు వారి ఆద్వర్యంలో నిర్వహించబ డుతున్న ఏ.ఆర్.టి కేంద్రము (హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులకు మందులు ఇచ్చు కేంద్రము) మకరయు కోస్టల్ నెట్వర్క్ ఆఫ్ పాజిటివ్ పీపుల్ (సిఎన్‌పి ప్లస్) సంస్థ సిబ్బందితో సమన్వయ సమావేశమును నిర్వహించారు. ఈ సమావేశములో డా. ఏ.అరుల్విసగన్, ప్రాజెక్టు డైరెక్టర్, పుదుచ్చేరి రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారు యానాం జిల్లాలో నివసిస్తున్న సుమారు 140 మంది హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులు కాకినాడ ఏ.ఆర్.టి. సెంటర్ నందు మందులు వాడుతూ ఉన్నారని వారి యొక్క సంవరక్షణ కొరకు తీసుకోవలసిన చర్యల గునరించి డా. ఐ.ప్రభాకర్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు టి.బి అధికారి మరియు సిబ్బందితో చర్చించారు, ఈ



చర్చలలో బాగంగా యానాం ప్రభుత్వ సర్వజనీన ఆసుపత్రిలో (జి.జి.హెచ్)లో లింకు ఏ.ఆర్.టి సేవలు ప్రారంభించుట ద్వారా హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులకు మేలు చేకూరుతుందని భావించారు. కాకినాడ జిల్లాలో మందులు వాడుతూన్న కారణముగా పుదుచ్చేరి రాష్ట్ర ప్రభుత్వం హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు అందించే ప్రభుత్వ పదకాలు కూడా పొందలేక పోతున్నారని తెలియజేశారు. పుదుచ్చేరి రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంస్థ యానాంలో హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులకు మెరుగైన సేవలు అందించేందుకు కాకినాడ జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ వారి సహాయ సహకరములను కోరాదము జరిగినది.ఈ సమావేశములో డా. ఐ.ప్రభాకర్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు టి.బి. అధికారి, పి.బాలాజీ, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్, ఏ.బుజ్జి బాబు, జిల్లా సూపర్వైసర్, డా. పృథ్వీ, వైద్యాధికారి, యానాం, డా. రత్నమణి, డా. శిల్ప, వైద్యాధికారులు, జి.జి.హెచ్. కాకినాడ, ఎమ్.రామ్ మోహన్, ప్రెసిడెంట్, టి.ఎన్.పి ప్లస్, కె.చిట్టితల్లి, సి.ఎన్.పి ప్లస్, ఏ.ఆర్.టి సిబ్బంది, పుదుచ్చేరి రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## రహదారి నిర్మాణ అవకతవకలపై విచారణకు ఆదేశం

- విచారణ అధికారిగా సబ్ కలెక్టర్



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల మధ్య నిర్మిస్తున్న రహదారులు నిర్మాణంలో అవకతవకలు జరగడం, అలాగే నిధులు దుర్వినియోగంపై స్పందించిన రంపచోడ వరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం విచారణకు ఆదేశించారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్‌ను విచారణాధికారిగా నియమిస్తూ 15 రోజుల్లో క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి, నివేదిక సమర్పించాల్సిందిగా పిఓ సూచించారు. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు మారేడుమిల్లి మండలం కుండాడ - జియం వలస గ్రామాల మధ్య నిర్మించిన బిటీ రహదారి నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని ప్రసార మాధ్యమాలలో వచ్చిన వార్తకు స్పందించి ఐటీడీఏ పిఓ విచారణకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. మారేడుమిల్లి మండలం కుండాడ నుండి జిఎం వలస గ్రామాల మధ్య మూడు కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించలేదని, పైగా రహదారి నిర్మాణం పరిశీలించకుండానే బిల్లులు చేసినట్టు ప్రసార మాధ్యమాలలో వచ్చిన వార్తపై 15 రోజులలో పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి నివేదిక సమర్పించే విధంగా రంపచోడవరం సబ్ కలెక్టర్ ను నియమించడం జరిగిందని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే రాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :**గ్రామీణ ప్రాంతాల అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)లు తెలిపారు. గురువారం పెద్దాపురం మండలం, నాబార్డు నిధులతో రూ.1.65 లక్షలతో పులిమేరు నుండి విరవ గ్రామానికి వెళ్ళే దారి సిసి రోడ్డు నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దే విధంగా అబివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని, అలాగే గ్రామంలో పూర్తి స్థాయిలో సిసిరోడ్లు, డ్రైన్లు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మొయిళ్ళ కృష్ణమూర్తి, గోరింట ఎంపిటిసి పచ్చిపాల సతీష్, టిడిపి నాయకులు తుమ్మల నాని, కొమ్మిరెడ్డి బుజ్జి, జనసేన నాయకులు కొప్పిశెట్టి నాగ బాబు, పలువురు కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో వాడ వాడలా వినాయక విగ్రహాలు ఏర్పాటు

- భక్తి శ్రద్ధలతో గణపతి పూజలు




**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** వినాయక చవితిని పురస్కరించుకొని మండలంలో వాడవాడల వినాయక విగ్రహాలు గ్రామ కమిటీల ఆధ్వర్యంలోఏర్పాటు చేశారు. ఈ ఏడాది వినాయకునికి ప్రీతికరమైన బుధవారం రోజు వినాయక చవితి రావడంతో భక్తులు తెల్లవారు జామునుండి ప్రతి వీధిలో ఏర్పాటు చేసిన సిద్ధివినాయకున్ని నిలబెట్టడంతో పురోహితులు వేద మంత్రాలతో పూజలు చేశారు.అలానే ఏజెన్సీ వాసులు కుటుంబసమేతంగా ఇంటి వద్ద బొజ్జ గణపతిని నెలకొల్పి తెల్లవారుజామునుండి పూలు 21రకాల పత్రిలతో పూజలు చేసి గణపతికి ఇష్టమైన ఉండ్రాలు తదితర వంటకాలు నైవేద్యంగా పెట్టి పూజలుచేశారు.విద్యార్థులు విద్యనిప్ర సాదించాలని,అలానే వ్యాపారస్తులు,వ్యవసాయదారులు వారి వారి వ్యాపారాలు,వ్యవసాయం కలిసిరావాలని ఆయురారోగ్యం,అష్ట ఐశ్వర్యాలు కలగచేయాలని సిద్ధివినాయకున్ని ప్రార్ధించారు. మండలంలో చవితి సంబరాలు అంబరాన్ని అంటాయి.

# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

- వృత్తి నైపుణ్య శిక్షణలతో మహిళల్లో ఆత్మగౌరవం
- టూల్ కిట్లు, యూనిఫాంలు అందజేసిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్



**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో పలు వృత్తి నైపుణ్య శిక్షణలు ఇస్తున్నామని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. మహిళలకు స్వయం ఉపాధి, ఆర్థిక పరిపుష్టి కల్పించే లక్ష్యంతో గురువారం రామచంద్రపురం జూనియర్ కళాశాలలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్ఎస్ఈటిఐ సౌజన్యంతో మహిళలకు 14 రోజులపాటు ఇవ్వనున్న జ్యూట్ బ్యాగ్ తయారీ శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆశయం మేరకు మహిళా సాధికారతే లక్ష్యంగా రామచంద్రపురం నియోజవర్గంలో ఇంటికో మహిళను పారిశ్రామికవేత్తలుగా చేయాలని కృషి చేస్తున్నామన్నారు. మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వినూత్న పథకాలు అమలు చేస్తున్నారని, ఆయన పిలుపు మేరకు మహిళలకు పలువృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి వారి ఉపాధికి ఊతం ఇస్తున్నామన్నారు. ఇప్పటికే కుట్టు మిషన్ల శిక్షణ, బ్యూటీషియన్ కోర్సు, ఎంబ్రాయిడరీ, జ్యూట్ బ్యాగుల తయారీ తదితర వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చామన్నారు. అపార అనుభవం ఉన్న శిక్షకులను తీసుకొచ్చి కోర్సు అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తున్నామ న్నారు. ఇక్కడ తయారుచేసిన ఉత్పత్తులు లోకల్‌గానే అమ్ముకునే వెసులు బాటు కల్పించేందుకు మంత్రి సుభాష్ చర్యలు తీసుకుంటున్నారన్నారు. మహిళలు తయారుచేసిన బ్యాగులు రానున్న పుష్కరాల్లో అమ్మకాలు జరిగేలా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కోనసీమ జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వర్మ, కాకినాడ జిల్లా ఎల్డిఎం ప్రసాద్, ఆర్.ఎస్.ఇ.టి.ఐ డైరెక్టర్ శ్రీనివాస్, యుబిఐ బ్రాంచ్ మేనేజర్ సునందిని తదితరులు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం చేపడుతున్న పథకాలు, అందిస్తున్న రుణాలు విపులంగా వివరించారు. రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ క్రింద మహిళలు శిక్షణ పొంది తమ జీవన ఉపాధిని మెరుగుపరుచుకోవాలన్నారు. మహిళలను ప్రోత్సహించేందుకు ముద్ర రుణాలు అందించి ప్రోత్సహి స్తున్నామన్నారు. జ్యూట్ బ్యాగ్ తయారీ శిక్షణకు వచ్చిన 35 మంది మహిళలకు ముఖ్య అతిథి వాసంశెట్టి సత్యం, అధికారుల చేతుల మీదుగా యూనిఫామ్, టూల్ కిట్లు (ముడి సరుకులు) అందజేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా శిక్షణకు హాజరైన మహిళలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ జ్యూట్ బ్యాగ్స్ తయారీ ఉచిత శిక్షణ తమ జీవనాధారానికి ఉపయుక్తంగా ఉంటుందని, మంత్రి సుభాష్ కు, ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## వెంకన్న అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి వసంతవాడకు చెందిన అమెరికాలో ఉంటున్న కాకర్లపూడి అజయ్ కుమార్, షర్మిల, స్కంధవి, వారి కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళాన్ని అందించారు. వీరికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. దాతలకు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, కూటమి నాయకులు, కాబోయే చైర్మన్ ముదునూరి వెంకటరాజు స్వామివారి చిత్రపటాన్ని అందించారు.



## ఆదిత్య యూనివర్సిటీలో ఘనంగా వినాయక చతుర్థి వేడుకలు



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో వినాయక చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకొని హాస్టల్ విద్యార్థులు,(గర్ల్స్ మరియు బాయ్స్) క్యాంపస్ లలో వినాయక విగ్రహాలను ప్రతిష్టించి భక్తిశ్రద్ధలతో పూజావిధులు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో ఆద్యంతం భక్తి భావంతో విద్యార్థులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్. డా. నల్లమిల్లి శేషారెడ్డి, ప్రో. ఛాన్సలర్. డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో. ఛాన్సలర్.డా. మేడపాటి శ్రీనివాసరెడ్డి పాల్గొని పూజలు చేసారు. ఈ సందర్భంగా డా. శేషారెడ్డి మాట్లాడుతూవినాయక చవితి హిందువులకు అత్యంత ప్రీతికరమైన పండుగ అనీ ముఖ్యంగా సిద్దిని బుద్దిని జ్ఞానాన్ని ప్రసాదించే వినాయకుడు విద్యార్థులకు మరీ ముఖ్యమైన పండుగ అని అన్నారు. ఇది ప్రకృతి సంభందమైనది విగ్నేశ్వరుని రూపం ద్వారా మనకెన్నో సందేశాలను ఇస్తారు అని పెద్ద తల తెలివికి ప్రతీక అని, పెద్ద చెవులు శ్రద్ధగా ఆలకించాలని, చిన్న కళ్ళు సూక్ష్మ బుద్ది శ్రద్ద ఏకాగ్రత్త కు,దం తాలు జ్ఞానం భావొద్వేగం, ఇలా ఒక్కొక్కటి మనకు ఒక్కో సందేశం ఇస్తుందని తెలుపుతూ విద్యార్థులు భవిష్యత్లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని శుభాకాంక్షలు తెలియజేసారు. డా.సతీష్ రెడ్డి మాట్లాడుతూ సకల జనుల అభీష్టాలను నెరవేర్చే గణపతి విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు ఒసగి మంచి స్థాయికి చేర్చాలని ప్రార్థిస్తున్నానని,తమ సంస్థలో వివిధ కోర్సులలో విద్య అభ్యసించడానికి సుదూర ప్రాంతాలనుండి వచ్చిన సోదర విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తమ ఇచ్చానుసారం వినాయక చవితి వేడుకలను ఆనందంగా చేసుకొనేలా వారితోనే తాముకూడా పూజలను ఇక్కడే చేయడం జరుగుతుందని,కుటుంబ సభ్యులకు దూరంగా ఉన్నామనే భావన వారికి కలగనీయకుండా వారితో పూజలు నిర్వహించడం ఆనందదాయకం అని అన్నారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకొని తల్లితండ్రుల కలలకు ప్రతిరూపాలుగా నిలవాలని డా. ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదిత్య యాజమాన్యం తమతో పాటు పాల్గొని ప్రతి పండగ పర్వదినాలలోను ఉత్సాహంగా మమ్ము ప్రోత్సహించడం ఎంతో సంతోషంగా ఉన్నదని విద్యార్థులు అన్నారు. పూజ అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్, నల్లమిల్లి శృతి రెడ్డి హాస్టల్ ఇంచార్జ్. హరీష్ రెడ్డి ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్తు సంస్కరణలకు వ్యతిరేకంగా ఐద్వా నిరసన




కాకినాడ, మేజర్ న్యూస్ : విద్యుత్ పోరాట అమరవీరుల రోజు స్మరించుకుంటూ విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ పెనుగుదురు గ్రామంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నిరసన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణీ మాట్లాడుతూ 2000 సంవత్సరం ఆగస్టు 28 విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటం పెద్ద ఎత్తున ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ బషీర్బాగ్ నందు జరిగిందని ఆనాటి తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండి పోరాటాన్ని అణిచివేయడానికి కాల్పులు జరిపించిందని, ఆ కాల్పుల్లో ముగ్గురు ప్రాణాలర్పించారని, వారు చేసిన త్యాగ ఫలితం కొంతకాలం ప్రజలకు విద్యుత్ ధరల పెంపుదల విషయములో ఉపశమనం కలిగిందన్నారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సవరణ జీవో గత రాష్ట్రప్రభుత్వం, నేటి రాష్ట్ర ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేయడానికి పూనుకోవడాని తప్పు పట్టారు. మోడీ అదాని లకు అనుకూలంగా ఉన్న విద్యుత్ సంస్కరణలను అమలు చేయడం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసం చేయడం దుర్మార్గమని విమర్శించారు. ఇప్పటికే ప్రతి కుటుంబానికి విద్యుత్ చార్జీలు పెను భారంగా మారిందని, స్మార్ట్ మీటర్ లాంటి విధానం తీసుకొచ్చితే మోయలేని భారంగా ఉంటుందని తెలిపారు. విద్యుత్ సంస్కరణలను వెనక్కి తీసుకునే వరకు పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో నూకరత్నం, విమల, రమాదేవి, డి.శారాబిన్, డి.మాధవి, వారా మంగ, డి.రాణి, వి.కావ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విహెచ్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆయన స్థాపించిన విహెచ్‌పిఎస్ (వికలాంగుల హక్కుల పోరాట సమితి) స్థాపించి 18 సంవత్సరాలు పూర్తి చేసుకుని 19 వ సంవత్సరం లోనికి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా గురువారం కాకినాడ జిల్లా కాకినాడ అర్బన్ నియోజకవర్గం అచ్యుతాపురం రైల్వే గేట్ కరణంగారి జంక్షన్ విక్టరీ బజార్ ఎదురుగా ప్రభుత్వ అంధుల ఆశ్రమం వద్ద విహెచ్‌పిఎస్ ఆవిర్భావ లిదినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా కో ఇన్చార్జి వల్లూరి సత్తిబాబు మాదిగ, ఎంఎస్‌పి జిల్లా కోఇన్చార్జి పలివేల నవీన్ మాదిగ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల విహెచ్‌పిఎస్ అధ్యక్షులు మేడపాటి బాపిరెడ్డి విచ్చేశారు. ఆయనతోపాటు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కాకినాడ జిల్లా ఇన్చార్జి పసుపులేటి చిన్నబాబు మాదిగ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆవిర్భావ దినోత్సవం సంద్భంగా కేక్ కట్ చేసి అందరికీ తినిపించారు. ఆయన మాట్లాడుతూ ఈవాళ్ళ వికలాంగుల 6 వేల పెంక్షన్ వస్తుందంటే అది మందా కృష్ణ మాదిగ పుణ్యము అని అన్నారు. పసుపులేటి చిన్నబాబు మాదిగ మాట్లాడుతూ వికలాంగుల కోసం మందా కృష్ణ మాదిగ ఎనలేని పోరాటం చేసారు అని గుర్తుచేశారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కాకినాడ జిల్లాలో ఉన్న 7 ఏడు నియోజకవర్గాల ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి ఇంచార్జులు, కోఇన్చార్జులు, నాయకులు, కార్యకర్తలతో పాటు విచ్చేసిన విహెచ్‌పిఎస్ కాకినాడ జిల్లా అధ్యక్షులు కంచుమూర్త గోపి, ఎమ్మార్పీఎస్ జిల్లా కోఇంచార్జ్ అనంతప రాజు మాదిగ, బంతి గణపతి, వరప్రసాద్, వడ్డే శ్రీను, చిన్ని, కాకినాడ జిల్లా కోఇన్చార్జ్ దేవరపు సురేష్ మాదిగ, కొడతా వీరబాబు, ఎంఎస్‌పి పిఠాపురం నియోజవర్గ గౌరవ అధ్యక్షులు, ఎమ్మార్పీఎస్ కాకినాడ టౌన్ నాయకులు నరుకుర్తి రాజు మాదిగ, మిరియాల కుమార్ మాదిగ, తుమ్మలపల్లి సంతోష్ కుమార్ మాదిగ, డోకూబురా రాజు మాదిగ మరియు విహెచ్‌పిఎస్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి మరియు అనుబంధ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# పేదవాడి ఆరోగ్యానికి సంజీవనిలా ముఖ్యమంత్రి సహాయనిధి...

**– 13 మంది లబ్ధిదారులకు 21,34,680/- లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గోరంట్ల...**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** పేదవాడి ఆరోగ్యానికి సంజీవనిలా ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. గురువారం ఉదయం గోరంట్ల వారి కార్యాలయం నందు ధవలేశ్వరం గ్రామానికి చెందిన గనగళ్ళ శ్రీలత (చంటి పాపకు) ఎల్.ఓ.సి 7,00,000/- రూపాయలు, పాతూరి అక్షశ్రీ 3,00,000/- రూపాయలు, దేవదాసి లిషిత 79,704/- రూపాయలు, నీలి సూర్యకాంతం 1,60,000/- రూపాయలు, సాటిలైట్ సిటీ గ్రామానికి చెందిన లాలం పైడిరాజుకు 3,90,000/- రూపాయలు, గండిమేను మహిమ కుమార్ కు 43,014/- రూపాయలు, కంటిపూడి ఏడుకొండలు 42,833/- రూపాయలు, కడియపు సవరం గ్రామానికి చెందిన గల్లా దుర్గకు 2,00,000/- రూపాయలు, కడియం గ్రామానికి చెందిన కంచర్ల వీర వెంకట దుర్గాప్రసాద్ 57,950/- రూపాయలు, మాధవరాయుడుపాలెం గ్రామానికి చెందిన సుంకర శ్రీనివాసరావు 35000/- రూపాయలు, మురముండ గ్రామానికి చెందిన సారాకుల వెంకట్రావుకు 30,786/- రూపాయలు, వీరవరం గ్రామానికి చెందిన ఉగ్గిన అజయ్ కు 23,400/- రూపాయలు, 16వ డివిజన్ కు చెందిన సుర దుర్గకు 71,993/- రూపాయలు, మొత్తం కలిపి 13 మంది లబ్ధిదారులకు 21,34,680/- లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ విద్య, వైద్యానికి ప్రాధాన్యతనిస్తూ, పేదవాడి ఆరోగ్య రక్షనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం నూతన విధానాలను అవలంబిస్తుందని అన్నారు. నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు సిఫార్సు చేసిన మెడికల్ బిల్లులను, ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫార్సు చేసి వీలైనంత తొందరగా వారికి ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తున్నానని తెలిపారు. రాష్ట్రంలో అనేక మంది పేదల ప్రాణాలు కాపాడేందుకు, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు వారు దాతృత్వంతో కోట్లాది రూపాయలు సీఎం సహాయనిధి ద్వారా అందిస్తున్నారని అన్నారు.

ధవలేశ్వరం గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు చెట్టుకొమ్మలు పడి మృతి చెందిన పాతూరి అక్షర శ్రీ కుటుంబానికి మూడు లక్షల రూపాయలు, గాయాల పాలైన దేవదాసి నిషితకు 80 వేల రూపాయలు, మంజూరు చేసినందుకు చంద్రన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పండూరి అప్పారావు, పుక్కళ్ళ రాజు, అంబటి శ్రీను, దేవల్ల రాంబాబు, వట్టికూటి దత్తుడు సావాడ శ్రీనివాస్ రెడ్డి, ఆళ్ల ఆనందరావు, ఎర్రమోతు ధర్మరాజు, బత్తిని ఏడుకొండలు, నాల రమేష్, దొడ్డి బాబ్జి, సింగవరపు సత్యనారాయణ, సుబ్బాయమ్మ, వరగోగుల వెంకటేశ్వరరావు, నిచ్చిన కోళ్ళ సత్తిబాబు, ఎమ్మెస్సార్ శీను, చౌడాడ లాజర్ తదితరులు పాల్గొన్నారు.

# విఘ్న వినాయక నమోస్తుతే - ఘనంగా వినాయకచవితి ఉత్సవాలు

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండలంలోని 17 గ్రామాల్లో బుధవారం వినాయక నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. వినాయకుని విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించి పీటలపై ఆశీనులను చేశారు. ఆత్రేయపురం పల్లపు వీధిలో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహం వద్ద సాగిరాజు రామకృష్ణంరాజు, పద్మావతి దంపతులు; పూజ, తేజ వర్మ లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు శిష్ట సూర్య కుటుంబరావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పెద్ద రామాలయం ఆంజనేయస్వామి విగ్రహం వద్ద, చిన్న రామాలయం ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద, బండారు కాలనీ అగ్రహారం కుమ్మరిగూడెం రంభ హోటల్ సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆయా కమిటీలు సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



# వరద బాధిత వాహనదారులకు

# జెకెసి ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ భోజనాలు






చింతూరు, మేజర్ న్యూస్ : గత కొన్ని రోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఏజెన్సీ మండలాల్లోతో సహా సరిహద్దు రాష్ట్రాలైన ఒరిస్సా, ఛత్తీస్గడ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో భారీ వర్షాలు కురవడంతో జాతీయ రహదారులపై వరద నీరు చేరి రహదారులు మూసుకుపోయాయి. చింతూరు మీదుగా ఒరిస్సాకు వెళ్లే జాతీయ రహదారి కుయుగూరు వద్ద వరద నీటితో ముంపుకు గురికావడంతో భారీ సంఖ్యలో వాహనాలు రహదారిపై నిలిచిపోయాయి. గత రెండు రోజులుగా రోడ్లపై నిలిచిపోవడంతో చట్టి జాతీయ రహదారి 30 వద్ద వందల సంఖ్యలో లారీలు నిలిచిపోవడంతో డ్రైవర్లు ఆహారం అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న లారీ డ్రైవర్లను గమనించి జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్, తెలుగుదేశం మండల అధ్యక్షులు ఎండి జమాల్ ఖాన్ వెంటనే తన సిబ్బందితో భోజనాలను వండించి ఆటోలో ఒరిస్సా రహదారిపై ఉన్న లారీ డ్రైవర్లకు అలాగే చట్టి జాతీయ రహదారిపై నిలిచిపోయిన లారీ డ్రైవర్లు అందరికీ ఉచితంగా భోజనాలు ట్రస్ట్ ద్వారా అందజేసి ఆకలిని తీర్చారు. ఆయుర్వేద వైద్యంతో పాటుగా అన్నదాతగా ప్రజల్లో జమాల్ ఖాన్ నిలిచినారు. ప్రతి ఏటా జరిగే వరదల సమయంలో జాతీయ రహదారులపై చిక్కుకున్న లారీ డ్రైవర్లకు భోజనాలు వండించి స్వయంగా సిబ్బంది చేత అందజేయడం జరుగుతుంది.

లారీ డ్రైవర్లు జమాల్ ఖాన్ ట్రస్ట్ ద్వారా చేసిన సేవా కార్యక్రమానికి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెకెసి ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్. వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు పసుపులేటి సాల్మన్ రాజు, సభ్యులు అబ్రార్ ఖాన్, రియాజ్, అజీజ్, ఎస్కె సమీర్, యాకుబ్ పాషా పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుడి కుటుంబానికి సానా సతీష్ బాబు ఫౌండేషన్ సాయం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ సాంబమూర్తి నగర్ కు చెందిన టీ. పళ్ళంరాజు అనే పేద కుటుంబానికి చెందిన వ్యక్తి గత కొన్నేళ్లుగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడ్డారు. వృద్ధాప్యంలో భార్యను పోషించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయం సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ దృష్టికి రాగానే, ఆయన వెంటనే స్పందించి గత ఏడాది నుండి పళ్ళంరాజు ఇంటికి నిత్యావసర సరుకులు పంపించేలా చర్యలు తీసుకున్నారు. కానీ, ఈ ఏడాది జూలై 3న పళ్ళంరాజు మరణించారు. ప్రస్తుతం ఆయన వృద్ధురాలైన భార్య రత్నం ఒక్కరే జీవనం సాగిస్తున్నారు. ఈ పరిస్థితిని గమనించిన హరీష్, రత్నంకి గురువారం రెండు నెలల నిత్యావసర సరుకులు అందజేశారు. ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులోనూ ఆమెకు సహాయం అందేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. నిత్యావసర సరుకులను ఫౌండేషన్ సభ్యులు మంగా వెంకట శివరామకృష్ణ, కృష్ణవేణి అందజేశారు.

## వెలిచేరులో వలకు చిక్కిన కొండచిలువ



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** మండలంలోని వెలిచేరు యూజీ పాలెం వద్ద మత్స్యకారులు రోజూలాగానే గోదావరిలోకి వేటకు వెళ్లారు. చేపల వేటాడుతుండగా వలలో కొండచిలువ చిక్కింది గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో మత్స్యకారులు భయాందోళనకు గురయ్యారు. ఎగువ ప్రాంతంలో వర్షాలు ఎక్కువగా ఉండటం వల్ల కొండచిలువ కొట్టుకు వచ్చిందని అనుకుంటున్నారు. ఆ కొండచిలువను అడవి శాఖ అధికారులకు మత్స్యకారులు అప్పగించారు.

## గ్రామ కన్వీనర్లు ప్రణాలిక బద్ధంగా పని చేయాలి



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** గ్రామ కన్వీనర్లు అందరూ ప్రణాళిక బద్ధంగా పని చేయాలని, ఆ విధంగా మండల కన్వీనర్లు దృష్టి పెట్టాలని సమరసత సేవా ఫౌండేషన్ గోదావరి జోన్ ధర్మ ప్రచారక్ తోట జగన్నాథం, ఆర్ ఎస్ ఎస్ విభాగ్ కుటుంబ ప్రబోధక్ పెమ్మరాజు సత్య రామచంద్ర రావు సంయుక్తంగా కోరారు. పిఠాపురం శ్రీ సూర్య రాయ గ్రంధాలయ భవనంలో జిల్లా కన్వీనర్ కంబాల నారాయణరావు అధ్యక్షతన జరిగిన సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సమావేశానికి అధికార ప్రతినిధిలుగా పాల్గొని మాట్లాడారు. దేశం కోసం, ధర్మం కోసం ప్రతి కన్వీనర్ ప్రణాళిక బద్ధంగా పనిచేసి భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు, జిల్లా మహిళా కన్వీనర్ గంధం వెంకట లక్ష్మీ, ఖండ కన్వీనర్లు కరెడ్ల చక్రి,రామ సుబ్బారెడ్డి,తోలేటి రామకృష్ణ, మండల కన్వీనర్లు ముమ్మిడి శ్రీనువాస్, పట్టాభి రామయ్య, నాగరాజు, ఈశ్వరరావు , గొల్లపల్లి వీర ప్రభాకర్,చత్రపతి శివాజీ, ఖండ ధర్మ ప్రచారకులు ఎ.శ్రీనువాస్, పడాల రాంబాబు, బుడంక్కాయల పేర్రాజు, కట్టా బంగార్రాజు, పంపన బోయిన వరహాలు, తంగేళ్ళ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# పింఛను అర్హత నోటీసులపై అప్పీలు తుది నిర్ణయం వచ్చే వరకు

## పింఛన్లు యధాతథంగా కొనసాగుతాయి

- ఎంపీడీవో వద్ద అప్పీలు చేసుకునేందుకు ఇంకా అవకాశం
- తాత్కాలిక వికలాంగత్వం సర్టిఫికెట్లు ఉన్న అర్హులకు కూడా పింఛన్లు పంపిణీ చెయ్యడం జరుగుతుంది
- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ భరోసా పింఛను అర్హత నోటీసులు అందుకున్న వారు సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో అప్పీలు సమర్పించుకునే అవకాశం ఇంకా ఉందని, ఇప్పటికే అప్పీలు చేసుకున్న వారికి తుది నిర్ణయం పొందే వరకు పింఛన్లు ఎటువంటి అంతరాయం లేకుండా యధాతథంగా కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. అదేవిధంగా, తాత్కాలిక వికలాంగత్వం సర్టిఫికెట్లు కలిగిన అర్హులకు కూడా పింఛన్లు పంపిణీ చేయబడుతాయని స్పష్టం చేశారు. నోటీసు అందుకుని ఇప్పటి వరకు అప్పీలు చేయనివారు సంబంధిత మండల అభివృద్ధి కార్యాలయాల్లో అప్పిలు చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ గురువారం అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి, ఇతర అధికారులు బొమ్మూరు కలెక్టరేట్ నుండి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ%-% పింఛను అర్హత నోటీసులు అందుకున్న వారు మండల అభివృద్ధి కార్యాలయాల్లో అప్పీలు సమర్పించిన పక్షంలో, తుది నిర్ణయం వచ్చే వరకు పింఛన్ల చెల్లింపులో ఎలాంటి అంతరాయం ఉండదని స్పష్టం చేశారు. అదేవిధంగా, జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాల పునరుద్ధరణ కోసం పైకప్పు వర్షపు నీటి సేకరణ వ్యవస్థలు, చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌లు, రీచార్జ్ పిట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా అర్హులైన రైతులకు యూరియా సరఫరా చేయడం, అలాగే పీఎం కుసుమ్ పథకంలో 10 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ ప్లాంట్ల కోసం అవసరమైన భూమిని గుర్తించి త్వరిత గతిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, డిఆర్ఓ సీతారామమూర్తి, సిపిఒ అప్పలకొండ, డ్వామా పీడీ నాగమహేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు, పిడి డిఆర్డిఏ మూర్తి, ఏడి సర్వే బి. లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం, వీవీప్యాట్ గోదామును తనిఖీ చేసిన జేసీ రాహుల్ మీనా





**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదామును గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా.. రెవెన్యూ, ఎన్నికలు, పోలీస్ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను తనిఖీ చేసి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ.. ఈవీఎం, వీవీప్యాట్ (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్)లకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు ప్రతి నెల ఈవీఎం, వీవీప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎస్.మల్లిబాబు, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.జగన్నాథం, ఇతర ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కొండబాబును కలిసిన ఆలయ నూతన పాలకమండలి సభ్యులు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ గాంధీనగర్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ మరియు పాలకమండలి సభ్యులను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు నియమించడం జరిగిందని ఆలయ చైర్మన్ వాసిరెడ్డి సత్యకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాడి కొండబాబును చైర్మన్ వాసిరెడ్డి సత్యకుమార్, సభ్యులు ఎన్.సన్నీ కిరణ్, ఎస్.సత్తిబాబు, ఏ.సత్యవేణి, ఎన్.సత్యవాణి, ఎం.రుక్మిణి, జీ.లక్ష్మీనారాయణ, ఏ.దురామణి, పి.సిహెచ్.సుబ్బారావు, తామందరం కలిసి ఎమ్మెల్యే కొండబాబు మర్యాదపూర్వకంగా కలిశామని తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆలయ పడిగట్లు, వాటి విధివిధానాలు పాటించి ఆలయ అభివృద్ధికి మీరందరూ కృషి చేయాలని, వెంకటేశ్వరస్వామివారికి జరగవలసిన పూజా కార్యక్రమాలు వాటి విధివిధానాలు తప్పనిసరిగా మీరు పాటించాలని, వచ్చే భక్తులకు ఏటువంటి ఇబ్బందులు కలగకుండా మీ వంతు సేవలు వచ్చేవారికి



అందించాలని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సూచించారని ఆలయ చైర్మన్ వాసిరెడ్డి సత్యకుమార్ తెలిపారు.

# కాట్రావులపల్లి గ్రామానికి దాహార్తిని తీర్చిన కల్లేపల్లి రాజేష్

– ప్రారంభించిన నటుడు హైపర్ ఆది



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** కాట్రావులపల్లి గ్రామంలో ఎన్ఆర్ఐ కల్లేపల్లి రాజేష్ ఆర్థిక సహాయంతో భారీ గణనాధుని విగ్రహ ప్రతిష్ట జరిగింది. తాను పుట్టిన గ్రామానికి ఎంతో కొంత సేవ చేయాలనే ఉద్దేశంతో కల్లేపల్లి రాజేష్ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కరోనా సమయములో రోగులకు ఆక్సిజన్ కొలత ఉండడంతో ఆక్సిజన్ సిలిండర్లను అందజేశారు. చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గ్రామానికి ఎన్నో సేవ కార్యక్రమాలు చేశారు. గ్రామానికి మంచినీటి కొరత ఉందని తెలుసుకుని 20లక్షల రూపాయలతో జివిల్ ఆర్ బోర్ వేయించి కాట్రావులపల్లి గ్రామానికి దాహార్తిని తీర్చారు. సంవత్సరానికి ఒకసారి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి యువతను ఉత్తేజ పరుస్తున్నారు. జగ్గంపేట టౌన్ కు ,పోలీస్ స్టేషన్ కు సీసీ కెమెరాలు అందజేశారు. పోలీసులకు యూనిఫాంను అందజేశారు.

గత మూడు సంవత్సరాల నుండి కాట్రావులపల్లి గ్రామంలో గణపతి నవరాత్రులను ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం 28 అడుగుల భారీ గణనాధుని మహారాష్ట్ర నుండి తీసుకువచ్చి కాట్రావులపల్లిలో ప్రతిష్టించినారు. గురువారం కల్లేపల్లి రాజేష్ కాట్రావులపల్లి ప్రజల దాహార్తిని తీర్చడం కోసం ఏర్పాటు చేసిన జి ఎల్ ఆర్ బోరును నటుడు హైపర్ ఆది చేతుల మీదగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా నటుడు హైపర్ ఆది మాట్లాడుతూ కల్లేపల్లి రాజేష్ తనకు జన్మనిచ్చిన గ్రామానికి ఎంతో కొంత సేవ చేయాలని ఉద్దేశంతో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. తాను ఎక్కడికి వెళ్లినా రాజేష్ యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తానని చెప్పారు. అనంతరం పాఠం శెట్టి సూర్యచంద్ర మాట్లాడుతూ కల్లేపల్లి రాజేష్ చేసిన సేవా కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కల్లేపల్లి రాజేష్ అభిమానులు, హైపర్ ఆది అభిమానులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

# అక్రమ కట్టడాలను తక్షణమే కూల్చి వేయాలి




**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం మండల కేంద్రంలోని నాన్ ట్రైబల్స్ అక్రమ కట్టడాలను గుర్తించి తక్షణమే కూల్చివేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు గురువారం డిమాండ్ చేసారు. రంపచోడవరం మండల తాసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్‌కు ఈమేరకు వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది.

ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షులు మోడిద నూకరాజు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలనే నిబంధనలు ఉన్నప్పటికీ రెవెన్యూ, పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని, దీని కారణంగా నాన్ ట్రైబల్స్ అక్రమ కట్టడాలు ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా విచ్చలవిడిగా నిర్మిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తంచేసారు. రంపచోడవరం మండల కేంద్రంలో ఇదివరకే అధికారులు అక్రమ కట్టడాలు గుర్తించి తొలగించినప్పటికీ తొలగించిన ప్రదేశంలో మళ్లీ విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని ఆయన ఆరోపించారు. మండల కేంద్రంలో మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఏజెన్సీ చట్టాలకు తూట్లు పొడుస్తూ అక్రమ కట్టడాలు నిర్మించి వ్యాపారాలు చేస్తున్నారని, వారి అక్రమ కట్టడాలు తక్షణమే కూల్చివేసి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా ఇన్ని అక్రమాలు జరుగుతున్నా, మరోపక్క ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అక్రమ కట్టడాలను గుర్తించి తొలగించాలని ఉత్తర్వులు ఇచ్చినా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని, ఈ నిర్లక్ష్యం వల్లనే రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ, ఆదివాసీ భూములు కబ్జాలకు గురవుతున్నాయన్నారు.

రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో వందల కొలది నాన్ ట్రైబల్స్ అక్రమాలు ఉన్నాయని, వాటిని తక్షణమే గుర్తించి తొలగించాలని డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఉన్నత న్యాయస్థానం నిబంధనలు ప్రకారం అక్రమాలు గుర్తించి తక్షణమే కూల్చివేయాలని పలుమార్లు జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు చేసామన్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు ఏజెన్సీ చట్టాలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఒకపక్క ఏజెన్సీ ప్రాంతాల్లో అక్రమ కట్టడాలు గుర్తించి తొలగింపు ప్రక్రియ కొనసాగుతుంటే రంపచోడవరం మండల కేంద్రంలో మాత్రం అక్రమ కట్టడాలు మళ్లీ యధావిధిగా వేలుస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా స్థానిక అధికారులు నిద్రపోతున్నారని విమర్శించారు. తక్షణమే జిల్లా కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్, సబ్ కలెక్టర్ స్పందించి ఏజెన్సీ ప్రాంతంలో అన్ని రకాల అక్రమ కట్టడాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ కోఆర్డినేటర్ పీఠా ప్రసాద్ పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించింది



**– ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** తమ కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీని చాలా పారదర్శకంగా నిర్వహించిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. యువతకు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులతో, మెగా డీఎస్సీ నిర్వహించామన్నారు. పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించామని, ప్రతి ఏటా మెగా డీఎస్సీ నిర్వహించి యువ ఉపాధ్యాయులతో విద్య రంగాన్ని దేశంలోనే తొలి స్థానంలో నిలబెడతామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ అభ్యర్థులకు వయస్సు మినహాయింపు ఇచ్చి వారికీ అండగా నిలబడ్డామన్నారు. యువత బాగుపడటం ఇష్టంలేని జగన్మోహన్ రెడ్డి మెగా డీఎస్సీని ఆపడానికి 24 కేసులు వేయించాడని, అవన్నీ తట్టుకుని "మెగా డీఎస్సీ" ప్రక్రియను పూర్తి చేసిన ఘనత లోకేష్ కే దక్కుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు... స్టూడెంట్ టీచర్ రేషియోకి సరిపడా ఉపాధ్యాయులు ఉంటేనే విద్యారంగ ముఖచిత్రం మార్చగలిగేది అని నమ్మిన విద్యావంతుడు లోకేష్ నాయకత్వంలో యువత కల నిజమైందన్నారు. 2014–19 మధ్య 2 డీఎస్సీలు జరిపి 18వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసింది టీడీపీ ప్రభుత్వమని గుర్తు చేశారు. చంద్రబాబు నాయుడు 14 ఏళ్ల ముఖ్యమంత్రి హోదాలో దాదాపు 13 డీఎస్సీలు జరిపి 1,80,208 పోస్టులు భర్తీ చేసి చరిత్ర సృష్టించారని, ఇప్పుడు విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల్లో అధిక భాగం ఆయన హయాంలో ఉద్యోగాలు పొందినవారేనని తెలిపారు. సమగ్ర శిక్షా సొసైటీ ఆధ్వర్యంలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 729 నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులను తమ కూటమి ప్రభుత్వం భర్తీ చేసిందన్నారు. 90 మంది ఎస్టీ యువతను కొత్తగా ఉపాధ్యాయులుగా నియమించిందని, 700 కోయభారతి టీచర్ పోస్టులు భర్తీ చేశామని, జూనియర్ కాలేజీల్లో 700 మంది సిబ్బంది సేవలు పునరుద్ధరణ చేయడం జరిగిందన్నారు. 476 ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో 3619 మంది కాంట్రాక్టు లెక్చరర్ల సేవలు పునరుద్ధరణ చేశామన్నారు. కాగా 2019 ఎన్నికలకు ముందు రాష్ట్రంలో 2 లక్షల 30 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, టీచర్ పోస్టులు 23 వేలకు పైగా ఖాళీగా ఉన్నాయని మెగా డీఎస్సీ ఇస్తానని యువతకు జగన్ రెడ్డి హామీనిచ్చి, అధికారం చేపట్టిన 4 ఏళ్ల 9 నెలల తరువాత 2024 ఎన్నికలకు సరిగ్గా 2 నెలల ముందు కేవలం 6,100 పోస్టులకు డీఎస్సీ విడుదల చేసి నిరుద్యోగులను మోసం చేశాడని మండిపడ్డారు. ప్రతి ఏడాది డీఎస్సీ అని, అధికారం చేతుల్లో ఉన్నప్పుడు ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించకుండా మెగా, జంబో, మినీ డీఎస్సీ అని కాలం గడిపేసిన దగాకోరు జగన్ రెడ్డిని విమర్శించారు. టెట్, డీఎస్సీ కలిపి నోటిఫికేషన్ ఇచ్చి అభ్యర్థులను గందరగోళానికి గురి చేసిన ఘనుడు జగన్ రెడ్డి అని దుయ్యబట్టారు. నోటిఫికేషన్ ఇచ్చిన 30 రోజుల్లోనే పరీక్షలు పెట్టడానికి ప్రణాళిక చేసిన తుగ్లక్ దేశంలో ఎక్కడైనా ఉన్నాడు అంటే కేవలం జగన్ రెడ్డి మాత్రమేనని ఎద్దేవా చేశారు.

స్కూళ్ళకు రంగులు వేసి రంగురంగుల బెంచీలు, కుర్చీలు వేసి...

నాడు–నేడు అని కలర్ ఫుల్ పేజ్ యాడ్లు ఇచ్చుకుంటే విద్యారంగ ముఖచిత్రం మారదు అని వైసీపీ నేతలు తెలుసుకుంటే మంచిదని సలహా ఇచ్చారు. పీఆర్సీ సాధన కోసం ఉద్యోగులు నిర్వహించిన విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డు ముట్టడికి ప్రయత్నించిన ఉపాధ్యాయులపై జగన్ లాఠీఛార్జ్ చేయించారని మండిపడ్డారు.

గౌరవప్రదమైన వృత్తిలో ఉన్న గురువులను మద్యం దుకాణాల ముందు కాపలా పెట్టించారని గుర్తు చేశారు. సిఫార్సు బదిలీల పేరుతో రూ.50 కోట్లు అక్రమంగా లాగేసుకున్నారని, ఎన్నికల విధుల నుంచి ఉపాధ్యాయులను కావాలని తప్పించే యత్నానికి పూనుకున్నారని పేర్కొన్నారు. సకాలంలో ఏ ఒక్క నెల కూడా ఉద్యోగులకు జీతాలు ఇచ్చారా అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కడప ఎమ్మెల్యే జగన్‌ను ప్రశ్నించారు.

# ఉద్యమ ఆధార్ నమోదుకు 200 మంది చిరు వ్యాపారులు హాజరు

**గండేపల్లి, మేజర్ న్యూస్ :** మండల మహిళా సమాఖ్య గండేపల్లిలో గౌరవ శ్రీ కలెక్టర్ సన్మోహన్ ఆదేశాల మెరకు జిల్లా పరిశ్రమల కెంద్రం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్త వారి సంయుక్త ఆద్వర్యంలో మండలంలో ఉన్నటువంటి చిరు వ్యాపారులకు (ఉద్యం అదార్) రిజిస్ట్రేషన్ మరియు ఉద్యం సర్టిఫికెట్ లు జారి చెయడం జరిగినది, ఈ కార్యక్రమానికి మండలంలో ఉన్నటువంటి చిరు వ్యాపారులు మొత్తం 200 హాజరు కాగా, ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులయినటువంటి డి ఆర్ డి ఎ నుండి డిపిఎం కెశవ, మరియు డిపిఎం బాబురావు , మరియు మండల్ ఇంచార్జ్ డీపీఎం భరత్ , డిఐసి నుండి అరుణ్ సందీప్ ఐ పీ ఓ జిల్లా పరిశ్రమల కెంద్రం వారు మరియు స్థానిక ఏపీఎం సన్యాసిరావు , సీసీలు వివివో తదితరులు పాల్గొన్నారు.




# రంగంపేట తాసిల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన ఆర్డిఓ




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** రాజమహేంద్రవరం రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ ఆర్.కృష్ణ నాయక్ రంగంపేట తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న పట్టాదార్ ఫోటో అప్‌లోడింగ్ పనులను పరిశీలించారు. అనంతరం డిజిటల్ రేషన్ కార్డులు పంపిణీ, నిత్యావసర సరుకులు పంపిణీ పై క్షేత్ర స్థాయిలో సమీక్ష నిర్వహించారు. గ్రామ స్థాయిలో మానిటరింగ్‌ను పెంచి, పౌరుల సంతృప్తిని దృష్టిలో ఉంచుకొని విధులు నిర్వర్తించాలని ఆర్.కృష్ణ నాయక్ ఆదేశించారు. భూసమాచారం డిజిటలైజేషన్, అప్‌డేట్ చేయడం కోసం రెవిన్యూ శాఖ చేపడుతున్న ఈ ప్రక్రియను సజావుగా, సమయపాలనతో అమలు చేయాలని ఆయన ఆదేశించారు.

తదుపరి ఆయన తహసీల్దార్ కార్యాలయంలో భూ సంబంధిత రికార్డులు, ధృవపత్రాలను పరిశీలించి పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలన్నారు. ప్రతి దరఖాస్తును వేగంగా పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని తహసీల్దార్లకు సూచించారు.

రంగంపేట గ్రామంలోని చౌక ధరల దుకాణాన్ని ప్రత్యక్షంగా సందర్శించిన ఆర్.కృష్ణ నాయక్ స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ విధానం, రేషన్ సరఫరా ప్రక్రియను పరిశీలించారు. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, లబ్ధిదారులకు సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని డీలర్లకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పౌర సరఫరాలు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ రేషన్ సరఫరా, కార్డుల పంపిణీ, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోరాదని తెలిపారు.

# అంతర్ జిల్లా దొంగలు అరెస్ట్



**రాజోలు, మేజర్ న్యూస్ :** గత రెండేళ్లుగా రాజోలు, మలికిపురం, నగరం, రావులపాలెం, ముదినేపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగలు నిందితులు పోలిశెట్టి పాండు రంగారావు, లంక మురళీకృష్ణలను రాజోలు మండలం శివకోటి గ్రామంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుండి రూ.17,30,000లు విలువ చేసే 171 గ్రాముల బంగారు ఆభరణాలు, 200 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నారు. పేకాట, క్రికెట్ బెట్టింగ్ వంటి చెడు వ్యసనాలకు అలవాటు పడి ఒంటరి మహిళల నివాసాలే టార్గెట్‌గా దొంగతనాలు చేసారని, పోలిశెట్టి రంగారావు భీమవరంలో టిఫిన్ సెంటర్ నడుపుతుండగా, లంక మురళీకృష్ణ సినీ ఆర్కెస్ట్రాలో ప్రోగ్రామ్స్ చేసేవారని పోలీసులు వెల్లడించారు. కేసు చేధనలో అమలాపురం క్రైం సీఐ ఎం.గజేంద్ర, రాజోలు సిఐ నరేష్ కుమార్ మరియు ఎస్సైలు పరదేశి, బాలకృష్ణ, రాజేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## సాయి ప్రదీప్‌ను ఘనంగా సన్మానించిన లయన్స్ క్లబ్



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** యర్రవరం గ్రామానికి చెందిన సాయి సందీప్‌ను లయన్స్ క్లబ్ ఆఫ్ ఏలేశ్వరం గురువారం ఘనంగా సన్మానించారు. గూగుల్ సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహించిన గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్ ప్రోగ్రాంకు సాయి ప్రదీప్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం నుండి గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా ఇటీవల ఎంపికయ్యాడు. జిఎస్ఎగా ఎంపికైన సాయి ప్రదీప్ ను లయన్స్ క్లబ్ ఆఫ్ ఏలేశ్వరం ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు అనుసూరి నాగేశ్వరరావు ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ సఖిరెడ్డి విజయబాబు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ స్పార్క్ ఫౌండేషన్ చేస్తున్న కృషికి, సాయి ప్రదీప్ గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా ఎంపికైనందుకు చాలా సంతోషం, మన ప్రాంతంలో మేధావులైన విద్యార్థులు అనేక అంశాల్లో ప్రతిభ చాటడం గర్వంగా ఉందని అన్నారు. లయన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరిగిన ఎంపికలో మన ఏలేశ్వరం నుండి సాయి ప్రదీప్ ఎంపిక అవ్వడం చాలా ఆనందంగా ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో స్పార్క్ చైర్మన్ ఎస్ సాయి సందీప్, లయన్స్ క్లబ్ సభ్యులు జ్యోతుల శ్రీనివాస్, అలమండ దుర్గాప్రసాద్, తందూరి రాము, ఊర రాజబాబు, కే నాగభూషణ్, రౌతు సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

## పిహెచ్‌సిలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎం అండ్ హెచ్‌ఓ



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని జడ్డంగి లాగరాయి, రాజవొమ్మంగి పి హెచ్ సి లను జిల్లా ఆరోగ్య శాఖాధికారి విశ్వేశ్వరనాయుడు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్స్‌లో ఒపీ వివరాలు వైద్యం అందుతున్న తీరును వైద్యులను అడిగితెలుసుకున్నారు. పేసెంట్ వార్డులను,స్కానింగ్ రూములను, తల్లీబిడ్డ వార్డులను, రక్తపరీక్ష గదిని పరిశీలించారు. మందుల స్టాక్ వివరాలు తెలుసుకుని అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని వైద్యులను ఆదేశించారు.

ఏజెన్సీలో పి హెచ్ సిలను సి హెచ్ సిలుగా మార్చేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి,వైద్యులు సుస్మా,తదితరులు వున్నారు.